
# పోతనభాగవతంలో రసగుళికలు

– ఆర్.శర్మ దంతుర్తి



## ముందుమాట

త్యాగరాజ కీర్తనలు తెల్సిన తెలుగేతరులు చాలా మంది అనే మాట: "మాకు కనక తెలుగు వచ్చుంటే ఎంత సంతోషించి ఉండేవాళ్ళమో, ఎందుకంటే త్యాగరాజ కృతులన్నీ అర్ధం అవుతాయి." ఈ మాట వింతగా ఉంటే త్యాగరాజ పంచరత్న కృతులు ఒకసారి చూడండి పూర్తి అర్ధంతో. అది కూడా కష్టంగా ఉంటే, ఎందరో మహానుభావులు అనే కృతిలో "చందురు వర్ణుని అంద చందమును హృదయారవిందమున జూచి బ్రహ్మానందమను భొందువారు" అనేది అర్ధం చేసుకోండి పోనీ. తెలుగు ఎంత అందమైన భాషో చెప్పకనే చెప్తున్నాయికదూ? చిన్నప్పుడు మనం తెలుగు వాచకంలో చదువుకున్న "ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపలనుండు లీనమై" అనే పద్యంగానీ, "ఇంతింతై వటుడింతయై.." అనే పద్యం గానీ గుర్తు ఉంటే వాటిని వ్రాసిన పోతన ఎంత మహామహుడో చెప్పడం అనవసరం. తెలుగులో పోతన భాగవతం అంటే తెలుగువాళ్ళు చేసుకున్న మహోన్నతమైన అదృష్టం. తెలుగు పద్యాలు కొంచెం కష్టపడితే (అంటే బాగా కృషిచేసి) రాయొచ్చు. కానీ మనం రాసే పద్యాలు ఎంతకాలం నిలుస్తాయి? పోతన పద్యాలు కలకాలం నిలవడానికీ, మనం రాసేవి మఖలో పుట్టి పుబ్బలో మాడిపోవడానికీ కారణం ఏమై ఉండొచ్చు? నా దృష్టిలో కారణం ఏమిటంటే, భగవత్కృప. పోతన భాగవతం రాయడానికి కారణం "పలికించెడు వాడు రామ భద్రుడట" అని తానే చెప్పుకున్నాడు. మనకీ పోతనకీ అదే తేడా. భగవత్కృప లేకుండా ఇలాంటి పద్యాలు ఎవరేనా రాయ(గల్గ)డం అసంభవం.

భాగవతంలో ఉన్న పద్యాలు చదువుతూంటే ఒక్కొక్కప్పుడు పోతన మీద భగవంతుడు ఎటువంటి కృప చూపించాడో అనిపిస్తుంది. పోతన సహజ పాండిత్యానికి భగవత్కృప తోడైంది - వెరసి మనకి దొరికింది ఒక వజ్రాల గని. పోతన భాగవతంలో పద్యాలు ఎనిమిదో తరగతి విద్యార్ధిక్కూడా సులభంగా అర్ధం అవుతాయి. ఆయనిది ద్రాక్షాపాకం. నోట్లోవేసుకుని చప్పరించడమే. ఆయన ఘంట తేనెలో ముంచి రాసాడా అనిపించక మానదు.

తి.తి.దే వారు పోతన భాగవతాన్ని ఐదు సంపుటాలుగా జంధ్యాల పాపయ్య శాస్త్రి సంపాదకుడుగా తీసుకొచ్చారు. తెలుగువాళ్ళందరు కొని దాచుకోవాల్సిన సెట్ అది. ఈ పుస్తకాలు చదువుతూంటే పోతన రసగుళికలు రాద్దాం అనిపించింది. అయితే ఇవి రాయడానికి నాకున్న ఒకే ఒక అర్హత ఏమిటంటే తెలుగు రాయడం చదవడం వచ్చు అని చెప్పుకోవడమే తప్ప ఇంకేమీ లేదు. నిజంగా. నేను రాయబోయేది చాలా మటుక్కు కాపీ, పేస్ట్ వ్యవహారమే. నాకు నచ్చిన పద్యాలూ, నాకు తెల్సున్న కధలూ ఇందులో జొప్పించి రాయడం మొదలు పెట్టాను. ఇవన్నీ ఒక వరుసలో భాగవతంలో ఉన్నట్టూ రాయడం లేదు. ఏ ఘట్టం గుర్తు వస్తే అది రాయడమే. ఇందులో పద్యాలకి అన్నిచోట్లా పూర్తిగా అర్ధాలు ఇవ్వడం లేదని గమనించగలరు. అవి కావాలిస్తే ఇంటర్నెట్లోదొరుకుతాయి. ప్రతి వ్యాసంలోనూ ఆఖరిపేజీలో ఇచ్చిన లింక్ మీద నొక్కి ఈ వెబ్ సైట్ కి నేరుగా వెళ్ళవచ్చు. ఈ వ్యాస పరంపరలో దొర్లే తప్పులన్నీ నావే అని ఒప్పుకోవడానికి ఏమీ సిగ్గుపడటం లేదు.

★★★★★

# 7 వ భాగం

## అంబరీషోపాఖ్యానం - 2

క్రితం వ్యాసంలో అంబరీషుడు ఉపవాసం అయ్యేక భోజనానికి కూర్చోబోతూండగా దూర్వాసుడొచ్చాడనీ, తనతోపాటు భోజనానికి కూర్చోమంటే ఇప్పుడే స్నానం చేసి వస్తానని యమునా నదికి వెళ్ళాడని తెల్సుకున్నాం. వెళ్ళినవాడు ఎంతకీ రాడు. అప్పుడు అంబరీషుడు ఉన్న విప్రులనందర్నీ అడిగేడు ఏం చేద్దాం అని.

ఆ. **అతిథి పోయిరామి నధిప! యీ ద్వాదశి**

**పారణంబు మానఁ బాడి గాదు**

**గుడువకుంట గాదు కుడుచుటయును గాదు**

**సలిలభక్షణంబు సమ్మతంబు.** [9-99]

వాళ్ళు చెప్పేరు, “భోజనం చేయడం కాదూ, చేయకపోవడం కాదు. మంచి నీళ్లు త్రాగండి. దానితో ద్వాదశీ వ్రతం పూర్తౌతుంది. ముని వెనక్కి వచ్చాక ఇద్దరూ భోజనం చేయవచ్చు. ఇది శాస్త్ర ప్రకారం ఆమోదయోగ్యమే” అన్నారు. దానితో అంబరీషుడు వాళ్ళు చెప్పినట్టుగా మంచి నీరు తాగి దూర్వాసుడి కోసం ఎదురుచూస్తూ కూర్చున్నాడు.

దూర్వాసుడు స్నానం చేసి వచ్చేడు సావకాశంగా. చూసి అన్నీ తెల్సుకున్నాడు. అసలే ఆకలితో ఉన్నాడు, దానితో తను తినకుండా ముందు రాజుగారు వ్రతం పూర్తి చేసేసుకున్నాడు. అప్పుడు కోపం రెట్టింపైంది. ఈ ప్రపంచంలో అన్నింటికన్నా ఏది ఓర్చుకోవడం ఎక్కువ కష్టం అనడిగితే, ఆకలి అని అందరూ ఒప్పుకునే మాట. ఆకలి వేసేవాడికి కోపం వస్తే శతకోటి దరిద్రాలని ఇంకో దరిద్రం చేర్చినట్టు లెక్క. అసలే దూర్వాసుడికి కోపం ఎక్కువ. ఇప్పుడు కావాలనో, తెలియకో స్నానం చేయడం ఆలస్యం చేసాడు. వెనక్కి వచ్చేసరికి వ్రతం అయిపోయింది. అంటే ఇప్పుడు రాజుగారు తనకి పెట్టేవి ఏవో మిగిలిపోయిన పదార్థాలు అని అనుకున్నాడు. దాంతో కోపం ఇంకా ఎక్కువైంది. ఇప్పుడు మునికి అసలు రాజు ఎందుకు అలా పారాయణ చేయవలసి వచ్చిందీ, రాజు చెప్పే సంజాయిషీలూ ఏమీ వినిపించలేదు, కనిపించలేదు. బద్దెన అన్నాడు కదా, తన కోపమె తన శతృవు.. అని.

సీ. **యమునలోఁ గృతకృత్యుఁడై వచ్చి రాజుచే**

**సేవితుండై రాజుచేష్టితంబు**

**బుద్ధిలో నూహించి బొమముడి మొగముతో**

**నదరెడి మేనితో నాగ్రహించి**

**రెట్టించి యాఁకలి గొట్టుమిట్టాడంగ**

**“నీ సంపదున్మత్తు నీ నృశంసు**

నీ దురహంకారు నిందఱుఁ గంటిరే?

విష్ణుభక్తుఁడు గాడు వీఁడు; నన్నుఁ [౯-101]

తే. గుడువ రమ్మని మునుముట్టఁ గుడిచినాఁడు

ధర్మభంగంబు చేసి దుష్కర్ముఁ డయ్యెఁ;

నయిన నిప్పుడు చూపెద నన్ని దిశల

నేను గోపింప మాన్పువాఁ డెవ్వఁ?" డనుచు. [9-101.1]

"చూడండయ్యా, ఈయన విష్ణు భక్తుడుట, నన్నేమో భోజనానికి పిల్చేడు. నేను వచ్చేలోపుల వ్రతం అదీ కానిచ్చి కులాసాగా ఉన్నాడు. వీడికున్న డబ్బు, సంపదా అన్నింటిమూలానా గర్వం ఎక్కువైపోయింది. నాకు కోపం వస్తే తగ్గించేవాడెవడు? ఇంతటి దుష్కర్మ చేసిన వీడిని ఇప్పుడేం చేస్తానో చూస్కోండి" అని అరుపులు అరిచేడు.

అని ఊరుకున్నాడా? కన్నూ మిన్నూ కానకుండా, ఏది మాట్లాడుతున్నాడో తెలీకుండా కోపంలో చిందులు తొక్కేడు. కోపంలో ఉన్నవాడికి ఏం తెలుస్తుంది? ఎంతటి వాడినైనా పట్టుకుని నానా మాటలూ అంటాడు.

చ. పెటపెటఁ బండ్లు గీఁటుచును భీకరుఁడై కనుఁగ్రేవ నిప్పుకల్

పొటపొటరాల గండములుపొంగ మునీంద్రుఁడు హుంకరించుచున్

జట మొదలంటఁగాఁ బెఱికి చక్కన దానన కృత్య నాయుధో

త్కట వరశూల హస్తయుతఁగా నొనరించి కవించె రాజుపైన్. [9-102]

పళ్ళు పటపటలాడిస్తూ, కంట్లో నిప్పులు కురిపిస్తూ తలలోంచి ఒక జట తీసి నేలమీద కొట్టేడు. అందులోంచి కృత్య అనే భయంకరమైన రాక్షసుడు రక రకాల ఆయుధాలతో బయటకొచ్చేడు. అంబరీషుణ్ణి చూపించి ఇదిగో ఇలా నన్ను అవమానించేడు, వీడి అంతం చూడు అని చెప్పేడు దూర్వాసుడు.

క. కాలానల సన్నిభయై

శూలాయుధహస్త యగుచు సుఱసుఱ స్రుక్కన్

నేలఁ బదంబులఁ ద్రొక్కుచు

వాలి మహాకృత్య మనుజవల్లభుఁ జేరెన్. [9-104]

ఆ కృత్య భూమి అదిరే నడకతో శూలం పట్టుకుని అంబరీషుడిమీదకి ఉరికింది. పాపం అంబరీషుడికి ఏం చెయ్యాలో తెలీలేదు. ఆయనేమో ధర్మ ప్రకారం చేయగల్గింతా చేసాడు. తప్పు లేశమాత్రం లేదు. అయినా దూర్వాసుడు ఒక రాక్షసుడ్ని బయటకి తీసి వదిలేడు. తప్పు చేయనివాడికి మనసులో ఏం కంగారు ఉండదు కదా? అలాగే అంబరీషుడు శ్రీహరిని ధ్యానిస్తూ కళ్ళు మూసుకున్నాడు ఈ కృత్యని చూసి. ఎందుకూ? ఎందుకంటే అంబరీషుడు 'హరి అని సంభావించును, హరి అని రుచిగొన దల్చును ... హరిహరి; ఘను నంబరీషు నలవియె పొగడన్" అని చెప్పాడు కదా మొదట్లో? ఇంతటి ఆపద వచ్చినప్పుడూ కూడా అయన హరినామ స్మరణ వదల్లేదు.

**ఆ. ఆ ప్రకార మెఱింగి హరి విశ్వరూపుండు**
**వెఱ్ఱి తపసి చేయు వేడబంబుc**
**జక్కcబెట్టు మనుచుc జక్రంబుc బంచిన**
**వచ్చె నదియుc బ్రళయవహ్ని పగిది.** [9-105]

భగవంతుడు ఎప్పుడూ కూడా ఎన్ని ఛాన్సులైనా ఇచ్చి చూద్దాం అనుకుంటాడు భక్తుడికి. ఎన్ని సార్లు తప్పు చేసినా "పోనీ, ఇంకోసారి చూద్దాం" అని చూస్తూ ఉంటాడు. ఎందుకంటే ఆయన అపార కరుణా సాగరుడు కాబట్టి. మనం చేసే కర్మలే మనకి బంధాలు కానీ భగవంతుడు మన కష్టాలకి కారణం కాదు. ఆయనో సాక్షి అలా చూస్తూ ఉంటాడు అంతే. ఇప్పటిదాకా దూర్వాసుడు కోపంతో ఎగరడం చూస్తూ ఉన్నాడు. ఆఖరి నిముషందాకా. కానీ దూర్వాసుడు వెనక్కి తగ్గట్లేదు. అంటే దూర్వాసుడు భక్త పాలన కళా సంరంభన అనే వృత్తంలోంచి తనకు తానే బలవంతంగా బయటకి వెళ్ళిపోయేడు. ఇంక మిగిలింది దానవోద్రేక స్థంభనే. ఇందులో భక్తుడూ దూర్వాసుడే, కోపం మూలాన దానవుడూ దూర్వాసుడే ఆ సమయంలో. ఇప్పుడు దానవోద్రేక స్థంభనకి కంకణం కట్టుకుని (అదీ కూడా ఆఖరి క్షణం వరకూ చూసి, చూసి), తన చక్రాన్ని పంపిస్తున్నాడు. ఏమనుకుని పంపించేడు? "వెర్రి తపసి" చేసే పిచ్చి పనులు ఆపమని; ఆయన్ని చంపేయమని కాదు. ఇక్కడ కూడా దూర్వాసుడ్ని ఇంకా భక్తుడుగానే చూస్తున్నాడు భగవంతుడు. అప్పుడు వచ్చిందిట చక్రం – ప్రళయకాలంలో వచ్చే అగ్ని లాగా.

వ. వచ్చి మునిపంచిన కృత్యను దహించి, తనివిచనక ముని వెంటంబడిన, మునియును మేరుగుహ జొచ్చిన నదియు నురగంబు వెనుకొను దవానలంబు చందంబునc దోన చొచ్చి మఱియును. [9-106]

ఇప్పటిదాకా ఊరుకున్నాడు భగవంతుడు భక్తుడ్ని ఊరికినే తప్పు పడుతూంటే. ఇప్పుడింక అమీ తుమీ తేల్చుకునే సమయం వచ్చింది. ఈ చక్రం ఎటువంటిదో హిరణ్యాక్ష వధలోనూ, గజేంద్రమోక్షంలోనూ ఒకసారి చూసేం. "సతతోద్యజ్జయశబ్దసన్ముఖరభాస్వచ్చక్రమున్ సంతతాశ్రితనిర్వక్రముcబాలితప్రకటధాత్రీచక్రముంజక్రము" వచ్చి కృత్యని క్షణంలో దహించింది. అయితే "ప్రతిభటశిక్షణంబును, నిజజనరక్షణంబును, నిఖిలజగదవక్రంబును నగు చక్రంబు" ఇప్పుడు దూర్వాసుడి మీదకి బయల్దేరింది. ఆయన మేరుపర్వతం గుహల్లోకి పోయి దాక్కున్నాడు. చక్రం కూడా ఆయనవెనకే అక్కడకి చేరింది. ఇప్పుడు దూర్వాసుడు పరుగు మొదలుపెట్టేడు.

**మ. భువిcదూఱన్ భువిదూఱు; నబ్ధిc జొర నబ్ధిన్ జొచ్చు; నుద్వేగియై**
**దివిcబ్రాకన్ దివిcబ్రాకు; దిక్కులకుc బో దిగ్వీథులం బోవుc; జి**
**క్కి వెసం గ్రుంగినc గ్రుంగు; నిల్వ నిలుచుం; గ్రేడింపc గ్రేడించు; నొ**
**క్కవడిన్ దాపసు వెంటనంటి హరిచక్రం బన్యదుర్వక్రమై.** [9-107]

విష్ణు చక్రం ఎలా తరుముతోందో చెప్తున్నాడు ఇందులో. భూమిలో దూరితే భూమిలో దూరుతుంది. ఆకాశంలోకి వెళ్తే అక్కడికే వస్తోంది. నిలిస్తే నిలిస్తుంది. ఏ దిక్కుకి పోయినా అక్కడికే వస్తోంది. దాన్ని చూసి దూర్వాసుడికి చావు భయం మొదలైంది. ఒక్కో జటా పీకుకుంటూ దాని మీదకి వదుల్తూ వస్తున్నాడు. హనుమంతుడి ముందా కుప్పిగంతులు? మొత్తం తపశ్శక్తి అంతా అయిపోయేక ఇంకేవరూ

దీన్ని ఆపలేని స్థితిలో (హరిచక్రం బన్యదుర్వక్రమై) ఆయన బ్రహ్మదేముడి దగ్గిరకి పరుగెట్టుకెళ్ళాడు. వెళ్ళి అయ్యా దీన్నుంచి నన్ను కాపాడేది మీరే అని చెప్పుకున్నాడు.

చక్రం దూర్వాసుడ్ని చంపలేదా? ఎందుకు చంపలేదు? కాని భగవంతుడికి కావాల్సింది అదిగాదు. దూర్వాసుడి కోపం, అహంకారం అణచాలి. దూర్వాసుడు సాధారణంగా మంచివాడే. కానీ కోపంలో ఇలా అయ్యేడు ఈ రోజున. మళ్ళీ చిన్న పక్కదారి. ప్రపంచంలో భగవంతుడు ఒకడే. రూపాలు అనేకం. ఏకం సత్ విప్రా బహుధావదంతి అన్నారు కదా? శివుడు రావణుడికి వరాలిచ్చినా, త్రిపురాసుర సంహారం చేసినా భగవంతుడు చేసేది లోక కళ్యాణమే. ఒక్కోసారి విష్ణువు చంపితే శివుడి ఆయుధాలూ, శక్తులూ ఆయన వాడుకోవచ్చు. శివుడు త్రిపురాసుల్ని చంపడానికి విష్ణువు బలం, ఆయుధాలూ వాడుకోవచ్చు. ఏది ఏమైనా భగవంతుడు అనేవాడు ఒక్కడే. ఆయన అంశ సత్వ రజస్తమోగుణాల్లో వీళ్ళలో కనబడుతూ ఉంటుంది. వీళ్ళందరూ ఒకటే. ఒకచోట ఏమిజరుగుతోందో అందరికీ అలా తెలుస్తో ఉంటుంది. కానీ భక్తుడు ఏ రూఫంలో ధ్యానిస్తే ఆ రూపంలోనే ఆయన కనబడుతూ ఉంటాడు.

ఇప్పుడు దూర్వాసుడు బ్రహ్మ దగ్గిరకి పోయి మొరపెట్టుకున్నాడు. ఆయన రక్షిస్తాడా? ఆయనకి తెలుస్తూనే ఉంటుంది కదా? చేసిన తప్పు ఒప్పుకోక తప్పదు. అందుచేత బ్రహ్మ చెప్తున్నాడు మునితో, "పోవయ్యా నేనెందుకు చేయాలి" అనకుండా, కాస్త లౌక్యం గా.

**మ. కర మర్థిన్ ద్విపరార్థ సంజ్ఞ గల యీ కాలంబుఁ గాలాత్ముఁడై**
**సొరిదిన్ నిండఁగఁ జేసి లోకములు నా చోటున్ విభుం డెవ్వఁడో**
**పరిపూర్తిన్ గనుఁగ్రేవఁ గెంపుగదురన్ భస్మంబుగాఁజేయు నా**
**హరి చక్రానల కీల కన్యుఁ డొకరుం డడ్డంబు గా నేర్చునే?** [9-110]

భలేవాడివే, నన్ను పుట్టించినాయనది చక్రం. నేను నిద్రపోయేటప్పుడు అంతా గాఢాంధకారం వ్యాపించిప్పుడూ జీవం అనేది లేకుండా చేసేవాడు, కాలం ఉన్నప్పుడు దీన్ని నింపేవాడూ, అది పోయాక దీన్ని భస్మం చేసేవాడూ విష్ణువు. అటువంటివాడి చక్రాయుధాన్ని నేను ఆపగలనా? నేను, శివుడు, దక్షుడు, మిగతా ప్రజాపతులూ భృగు మహర్షి అందరం కూడా ఆయన ఆజ్ఞల్ని పాటించే వాళ్లమే. మేమేం చేయగలం?

ఇందులో బ్రహ్మ చెప్తున్నాడు – నేనేమీ చేయలేనని శివుడి దగ్గిరకి వెళ్తావేమో, ఆయన కూడా ఏమి చెయ్య(లే)డూ జాగ్రత్తా అని. ఇలా అనేసరికి ఇంకేమీ వినిపించుకోకుండా దూర్వాసుడు శివుడి దగ్గిరకి పరుగెట్టాడు. ఎందుకంటే ఆయన హాలాహలాన్ని నేరేడు పండులా మింగి నీలకంఠుడయ్యేడు కదా? ఈ చిన్న చక్రాన్ని ఆపలేడా అని. ఆపగలడా అనేది కాదు ప్రశ్న. నిజంగా ఆపుతాడా?

పోతన భాగవతం ఇంటర్నెట్లో ఇక్కడ చూడవచ్చు: http://telugubhagavatam.org/

(కొనసాగింపు వచ్చే సంచికలో)

COMMENTS